


# తల్లి ప్రేమ

**లక్ష్మీ భారతీరెడ్డి**

**బస్సు దిగి రోడ్డు దాటి ఇంటి దారి పడుతుండగా "హలో రావుగారూ!" అన్న పిలుపు వినిపించేసరికి ఆగి తల తిప్పి చూశాడు రావు. అతన్ని సమీపిస్తున్న సుధాకర్ కనిపించాడు.**

"ఆ ఎలా ఉన్నారు? అంతా కులాసేనా? ఇంతకూ నేనడిగిన పనిలోనే ఉన్నారా? మనసు పెట్టి రాయాలేగానీ అంది మీకు ఓ గంట పని మాత్రమే." రావును చూస్తూ అన్నాడు సుధాకర్.

ఏదో కాలక్షేపం కోసం కవితలు రాయడం, అందులో విజయం సాధించాక కథలు రాయడం, ఇందులోనూ పట్టు సాధించడం జరిగిపోయింది కాల ధర్మంతో పాటు.

సుధాకర్ అతనుంటున్న వీధిలోనే ఉండటంతో పరిచయం ఉంది.

"అమ్మ గురించి కథ రాయరూ!" అంటూ చాలాకాలంగా అడుగుతున్నాడు సుధాకర్.

అతనికీ రాయాలనే ఉన్నా అమ్మలేని అతనికి, అమ్మ ప్రేమంటే ఏమిటో తెలీదు. చాలా చిన్నతనంలోనే అమ్మా నాన్నలు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో మావయ్య వద్దే పెరిగి పెద్దయ్యాడు. అమ్మ అనే కమ్మని పదంలో మాధుర్యం తెలీదు.

అమ్మంటే జన్మతోపాటు జీవితప్రదాయిని.. సూర్యోదయానికి, అస్తమయానికి మధ్య ఎన్ని సమస్యలెదురొన్నా., ఎన్ని ఆకలిరాత్రులనో అధిగమించి బిడ్డ కడుపును నింపే అన్నపూర్ణ.. ఆమిచ్చిన చనుబాల తోడు ఇది నిజం. ఆ పై చందమామను చూపిస్తూ తినిపించిన గోరుముద్దల తోడు.

"ఏదీ పని వత్తిళ్ళలో అవిరామం. అందుకే ఈ మధ్య రచనలూ కాస్త మందగించాయి. రెండు నెల్లుగా కథ కాదు కదా నాలుగు లైన్ల కవితా రాయలేదు"

"పని వత్తిళ్ళు సదా ఉండవు కదాండి. మీ వీలు చూసుకునే రాయండి. అయితే ఈసారి మీ కథ మాత్రం 'అమ్మ' గురించే రాయాలి" అంటూ శెలవు తీసుకున్నాడు సుధాకర్.

ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు రావు.

❋ ❋ ❋

మంచి ఆలోచనలు ప్రశాంత వాతావరణంలో పుట్టాయన్నారు పెద్దలు, అనుభవజ్ఞులు కూడా. వేసవికాలం కావడం వల్ల ఉదయం అయిదున్నరకే చిరువెలుతుర్లు ప్రారంభమైనాయి. కొన్ని తెల్లకాగితాలు, పెన్‌తోపాటు రైటింగ్ ప్యాడ్‌ని తీసుకొని మిద్దెపైకెక్కాడు రావు. అతని ఇంటి పక్కనే ఓ చింతచెట్టుంది. అది చాలా పెద్దది కావడంతో ఆ కొమ్మలు మిద్దెపైకి వచ్చాయి. మిద్దెను ఆవరించిన ఆ కొమ్మల కిందే కూర్చుని 'అమ్మ' కథను గురించి ఆలోచించసాగాడు. ఎంతకూ కథకు ఐడియా రావడం లేదు. పరధ్యానంగా తలెత్తి చూశాడు. తన ఇంటికి మరో రెండిళ్ళ తర్వాత మరో మిద్దెపై కొన్ని కోతులు ఆడుకుంటున్నాయి. ఆ ఇంటికి పిట్టగోడ లేకపోవడం వల్ల అవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రపంచంతో మాకేమిటి పని? అన్నట్లుగా ఆటలోని ఆనందాన్ని పొందుతున్నాయి. ఒకదాని మీద ఒకటి పడుతున్నాయి. రెచ్చగొట్టుకుంటూ కీచుకీచుమని శబ్దాలు చేస్తూ నానా హంగామా చేస్తున్నాయి. ఇదిలా ఉండగా ఉన్నట్టుండి బాగా బలంగా ఉన్న మరో కోతి వచ్చింది అక్కడికి. దాన్ని చూడగానే మిగతా కోతులన్నీ ఆటను ఆపేసి ఆగిపోయి భయం భయంగా ముడుచుకుని కూర్చున్నాయి. ఆసక్తిగా గమనించసాగాడు రావు. మనుషుల్లో గూండాలు, రౌడీలు ఉన్నట్లుగానే కోతుల్లో అది గూండా కోతేమో? అనుకుంటున్నాను. ఆ గూండా కోతి మిగతా వాటి వంక గంభీరంగా అడుగులు ముందుకు వేస్తోంది. మిగతా కోతులన్నీ జత కూడి ఒక్క చోటనే కూర్చున్నాయి ఆందోళనగా.

ఉన్నట్టుండి గూండా కోతి వాటి మీదికి దూకింది గాల్లోకి ఎగిరి. అవన్నీ చిన్నాభిన్నమైనాయి. కీచురావాలతో యుద్ధం భయంకరంగా సాగుతోంది. గూండా కోతి విజృంభిస్తోంది. దాని ధాటికి మిగతావాటి పరిస్థితి గందరగోళంగా ఉంది. దాదాపు పది నిమిషాల యుద్ధానంతరం మరోసారి వార్నింగ్ ఇస్తున్నట్టుగా గట్టిగా అరిచి ఆ ఇంటి పక్కను ఉన్న చెట్టుపైకి ఎగిరి వెళ్ళిపోయింది.

మిగతావాటి స్థితి దయనీయంగా ఉంది. కొన్ని గాయపడ్డాయి. కొన్ని మూర్ఛపోయాయి. అయితే వీటన్నిటికీ భిన్నంగా ఓ పిల్లకోతి చనిపోయింది. తల్లి కోతి ఆ శవం చుట్టూ బాధగా అరుస్తూ పొర్లుతోంది.

ఓ రెండు నిముషాల తర్వాత..

తల్లికోతి, పిల్లకోతిని అక్కున చేర్చుకుని చెట్టుపైకి ఎగిరింది. మిగతావన్నీ దీనంగా చూడ్డం తప్ప ఏం చేయగలవు? చనిపోయిన పిల్లకోతి శవాన్ని తీసుకుని ఇది ఏం చేస్తుంది? అన్న ఉత్సుకత పెరిగింది రావుకు.

వెంటనే మిద్దె దిగి సైకిల్ తీసుకుని ఆ చెట్టును సమీపించాడు వేగంగా. ప్రాణం లేని పిల్లను అతి జాగ్రత్తగా పట్టుకుని దిగి బయలుదేరింది. దాని వెంటే రావును.

ఊరి చివర ఖాళీ మైదానం చేరింది. ఎవరో ఎందుకో తీసుంచిన నాలుగు అడుగుల గోతిని కనిపెట్టింది. తన బిడ్డ శవాన్ని అందులో ఉంచి వెనుదిరిగింది. ఊరి మధ్య లోని శ్రీ కోదండరామాలయంలో స్వామివారి గర్భగుడి వెలుపలనున్న శ్రీ ఆంజనేయ విగ్రహానికి భక్తులు సమర్పించిన పూలమాలల్లో నుంచి ఓ మాలను తీసుకుని తన మెడలో వేసుకుంది. అంత క్రితమే కాబోలు భక్తులు వెలిగించిన అగర్‌బత్తీలను పుల్ల భాగాల్ని నోట కరచుకుని వెనుదిరిగింది.

రావూ దాని వెంటేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను. బిడ్డ శవాన్ని సమీపించి అగర్‌బత్తీలను, పూల మాలను పక్కనపెట్టి మట్టితో గోతిని నింప సాగింది రోధిస్తూ. ఆ తర్వాత సమాధిపై పూల మాలను వేసింది. దాని మధ్య అగరొత్తులుంచి భూమికి తలవాల్చి నిముషం తర్వాత తలెత్తింది కారుతున్న కన్నీళ్ళతో.

ఆపై తన జీవనయానానికి బైలుదేరింది భారంగా. ఆ దృశ్యాలన్నీ చూసిన రావు హృదయం కదిలిపోయింది. బిడ్డను కని కుప్పతొట్లో, మురికి కాలువల్లో పడేస్తున్న నవనాగరీక మనుషులకన్నా ఈ మూగజీవి తల్లి ప్రేమ ఎన్ని రెట్లో గొప్పది. మనసంతా వెలితి, ఏదో కొరతగా ఉందతనికి వెళ్తున్న ఆ కోతి వంకే చూస్తూ ఆగిపోయాడు.

ఇంటికి చేరి పెన్ను, పేపరు తీసుకుని 'అమ్మ' గురించి చాలా సులభంగానే రాయగలిగాడు.

కథ తీసుకుని సుధాకర్ ఇంటి వైపు బయలుదేరాడు రావు. ❋

## సంతానానికి పురుష సహాయం వద్దా!



**డా**ఫ్నియా ఒక నీటి ఫ్లీ. ఫ్లీ అనే పేరుకు కారణం వాటి గమన విశేషమే. అవి నడవవు, ఈదవు. పాకవు, ఎగరవు. మరి ఎలా వాటి శరీరం ముందు ఒక జత స్పర్శశృంగాలు ఉంటాయి. వాటికి శాఖలు ఉంటాయి. వాటిని ఆసరా చేసుకొని ఈ హాప్ అండ్ డ్రాప్ పద్ధతి ఉపయోగిస్తాయి. పైకి ఒక దూకు దూకి అలా కిందికి కాస్త దిగుతాయి. తిరిగి అదే చర్య మళ్ళీ. అయితే పాపం అలా మరీ దిగిపోకుండా నిత్యం అవి ఈదుతూనే ఉండాలి.

ఆల్చిప్పల్లాగా వీటికి రెండు కవాటాలుంటాయి. వీటి మధ్య శరీరం యావత్తూ ఇరుక్కొనిపోతుంది. తల మొండెం కాళ్ళు ఇత్యాదులు లోపల దాని అంగాలు నిత్యం పనిచేస్తూ అతి సూక్ష్మజంతువులను వడబోస్తాయి. ఆ విధంగా అంత జంతువు కేవలం బాక్టీరియా మీదనే అధారపడుతుంది.

ఇక దాని సంతాన కార్యక్రమం వింతగానే సాగుతుంది. ఆడది తన గుడ్లను వెనక సంచిలో వేసుకొంటుంది. కొద్దిరోజుల తరువాత అవి పిల్లలవుతాయి. అవన్నీ అచ్చం తల్లిలాగే ఉంటాయి. కానీ చాలా చాలా చిన్నవి. కుబుస విసర్జనల ఫలితంగా ఎదుగుతాయి. సంతానోత్పత్తికి సిద్ధమవుతూ గుడ్లు పెడతాయి. పరిస్థితులు అనుకూలంగా ఉన్నంతవరకు ఇది ఇలా సాగిపోతుంది. అయితే ఇందులో వింతేముంది. అంటారా? ఉంది. ఆ సంతానం ఇన్ని తరాలు కేవలం ఆడవే. మగ సంతాన దర్శనం ఉండదు. 2, 3 రోజులకొకసారి ప్రతి ఆడది ఇలా 20 సంతానాలని కంటూ వస్తుంది. ఒక్కొక్కసారి ప్రతి ఆడదీ ఈ కార్యక్రమాన్ని 2,3 గంటలకొకసారి చేస్తుంది.

మగదాని అవసరం లేకుండానే ఇదంతా. అయితే పరిస్థితులు మారి గడ్డుకాలం వస్తుంది. జనాభా అధికం అయిపోతుంది. అప్పుడు కొన్ని గుడ్లు పోనీలే అంటూ మగవాటిగా తయారవుతాయి. ఆడదాని గుడ్లు అప్పుడు ఫలదీకరణ కోరుకుంటాయి. **– జమ్మి కోనేటిరావు**